Reg. No. M. 1714.

అష్టమసంపుటము. తృతీయసంచిక.

# గ్రంథాలయసర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘపక్షమున
ప్రకటింపఁబడు మాసపత్త్రిక.

సంపాదకుఁడు:
అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయసూచిక


రాజోలు ఆంధ్రగ్రంథాలయసభ. ... ౩౩
పల్లెటూరు గ్రంథాలయములు-అమెరికా. ... ౩౫
గొప్ప గ్రంథాలయము-అమెరికా. ... ౩౯
కంభం-మార్కాపురం తాలూకాల గ్రంథాలయముల ప్రథమమహాసభ. ... ౪౦
శ్రీ మోహనవిలాస గ్రంథాలయము. ... ౪౨
గ్రంథాలయములు-రైతాంగము. ... ౪౬
శ్రీ శివజ్ఞానబోధ సమాజము. ... ౪౭
శ్రీ విజ్ఞానవర్ధనీ గ్రంథనిలయము, భట్లపెనుమఱ్ఱు ౪౮
శ్రీ ఆంధ్రసంవర్ధనీ గ్రంథాలయము-శికిందారాబాదు. ౪౮


బెజవాడ: ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
క. కోదండరామయ్యగారిచే ముద్రింపఁబడి ప్రకటింపఁబడినది.

వార్షికమూల్యము రు ౧-౪-౦.] [విడిసంచిక వెల రు ౦-౨-౦.

## విజ్ఞాన చంద్రికా మండలి, బెజవాడ.

## అచ్చునకు సిద్ధముగానున్న గ్రంథములు

### మానవధర్మదర్శిని.

ఇటలీదేశ భక్తాగ్రేసరుడగు "మాజినీ" మహాశయుని గ్రంథము ననుసరించి, శ్రీ శ్రీ శ్రీ యోగి తత్త్వానందస్వామి, బి ఏ., గారిచే రచియింప బడినది. "మాజినీ" మహర్షిపుంగవుని యొక్క విపులమగు జీవితచరిత్రముగూడ చేర్చబడినది.

### ౨. డచ్చిప్రజాస్వామిక ప్రారంభము.

దేశభక్త కొండ వెంకటప్పయ్యగారిచే రచింపబడినది.

### ౩. ఫ్రెంచి స్వాతంత్ర్యవిజయము.

### ద్వితీయభాగము.

అయ్యదేవర కాళేశ్వరరావుగారిచే రచియింపబడినది.

### ౪. బీజగణితము.

కొమరాజు లక్ష్మణరావుగారిచే రచియింపబడినది.

---

## అపక్వశాకాహారాద్వైత సిద్ధాంతము

ఇదియొక నూతనగ్రంథము. ఇందలి విషయములు బహువిచిత్రముగాను అతిసులభముగాను యుండును. దీనినిబట్టి మనుజులు నడుచుకొనినచో దరిద్రము, వ్యాధి యుండదు. ప్రతిమనుజునకు తృప్తి, చిదానందము, బలము, తేజస్సు, పరాక్రమము గలిగి ఎవరంతటవారు యితరుల సహాయములేనిదే జీవింపగల సామర్థ్య మేర్పడును. ఈశ్వర సాక్షాత్కారము, వైరాగ్య మెట్లు గలుగునో వాటికి నయితేము ప్రత్యక్షసాధనలు చెప్పబడియున్నవి. ఈపుస్తకము వలయువారు గ్రంథకర్తకు రు 2-0-0 మనియార్డరుద్వారా పంపి తెప్పించుకొనవలెను.

గ్రంథకర్త,
బొల్లాప్రగడ సుందర గోపాలరావు,
ప్రకృతి చికిత్స ప్రోత్సాహకర్త, రాజమహేంద్రవరం.

RSVM01A143



# గ్రంథాలయసర్వస్వము.

సంపు ౮. | బెజవాడ - సెప్టెంబరు ౧౯౨౯. | సంచిక ౩.

## రాబోవు ఆంధ్రగ్రంథాలయసభ.

ఆంధ్ర సోదరులారా !

నవంబరు మొదటివారములో ఆంధ్రసభలు బెజవాడలో జరుగుననియు ఆసందర్భమున ఆంధ్రగ్రంథాలయసభయు సమకూడుననియు తెలియుచున్నది. బెజవాడ కూడలిస్థానము గనుకనున్నూ ఆంధ్రదేశమున అనేక యుద్యమములు కృషిచేయుచున్నవి గనుకనున్నూ అఖిలాంధ్రసభలు అనేకము జరుగునని ఊహించతగిఉన్నది. ఈప్రకారము చూచినచో గ్రంథాలయసభకూడ తక్కిన చిల్లరసభలతోపాటు ఏ ఉదయముననో ఏ రాత్రిపూటనో జరిపి మామూలు తీర్మానములు ప్యాసుచేసి అంతము పొందించబడునని జోస్యము చెప్పుట సాహసముకాదు. జరుగబోవుసభ ఎట్లుగా పరిణమించుచున్నను కర్తవ్యము ఏదో వివరించుట విద్యుక్తధర్మము.

ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము ముప్పది సంవత్సరములపై కాలమునుండి కృషిచేయుచున్నది. ప్రథమములో కేవలము అనధికారులచే ప్రారంభింపబడి వారలచేతనే అభివృద్ధి జెందినది. ఈ రాజధానిలో కేవలము అనుద్యోగీయులు నడపు గ్రంథాలయములకు ప్రభుత్వపు బొక్కసమునుండి పైరాశమును ప్రథమములో సంపాదించినది (మదరాసు) శాసననిర్మాణసభలో అప్పుడు ప్రజల ప్రతినిధిగానున్న మ.రా.రా.శ్రీ. కొండ వెంకటప్పయ్య పంతులుగారు (అప్పటికి వారికి దేశభక్తబిరుదు రాలేదు) ఆంధ్రనాయకులుగదా. స్థానిక సంస్థలనుండి మొట్టమొదట. సాలియానాగ్రాంటును సంపాదించినది బెజవాడ రామమోహన ధర్మపుస్తక భాండాగారము. ఆంధ్రదేశపుదే గదా. గ్రంథాలయమనగా కేవలము గ్రంథములు భద్రపరచు స్థల

ముమాత్రమే కాదనియు గ్రంథభాండాగారియన పుస్తకముల కాపరి కాదనియు గ్రంథాలయములకు వచ్చువారికి వారివారి కోరికలను బట్టి తగిన గ్రంథములను వారికి సప్లయి చేయుటయేగాక గ్రంథాలయమునకు రా వీలులేని వారివద్దకు గ్రంథాలయము వెళ్ళవలెననియు మద్రాసు రాజధానిలో మొదట బోధించినవారును అనుభవమునకు తెచ్చినవారును ఆంధ్రులే. కేవలము చక్షురక్షర సంయోగము వలననే గాక ఇతర జ్ఞానేంద్రియముల మూలమునకూడ జ్ఞానోపార్జన కావలసి యున్నదిగనుక ఈసర్వతోముఖ సాధనవిధానమంతయు గ్రంథాలయముల పక్షమున నిర్వహించవలయునని గుర్తెరిగి తత్ప్రసిద్ధికొరకు కృషి చేయుటకు దక్షిణఇండియాలో ప్రప్రథమమున ప్రారంభించినది ఆంధ్రులే. అఖిలభారత గ్రంథాలయోద్యమమును ప్రారంభించిన వారు ఆంధ్రులే. ఇదియది యననేల యీడుముదిరినవారి విద్యాభివృద్ధి (Adult education) కొరకు కృషిచేయుటకు ఈప్రాంతముల ప్రారంభించినవారు ఆంధ్రులే.

బడివదలినవారి విద్యాభివృద్ధికొరకై ప్రపంచ మంతటిలో కలిగిన ప్రబోధమునకు ఫలితము మన రాజధానిలోకూడ కొంతచలనము గలిగినది. మన తమిళసోదరులు రాజధానీ పట్టణమందు "మద్రాసు లైబ్రరీసంఘ"మను పేర సంస్థనొకదానిని ప్రారంభించి దాని యాజమాన్యమున కొంత కృషిజరుపుచున్నారు. ఇందువలన ప్రభుత్వమువారి దృష్టిని గ్రంథాలయముల వైపున కాకర్షించినారు. ఆంధ్రేతర ప్రాంతములందు అచ్చటచ్చట యువకుల విద్యాభివృద్ధి కొరకై సంస్థలేర్పడుచున్నవి. ప్రభుత్వమువారును ఈవిషయమును గూర్చి కొంత శ్రద్ధ తీసికొనుచున్నారు.

ఇట్టితరి ఆంధ్రులకర్తవ్యమెద్ది? గడచిన ముప్పది సంవత్సరములనుండియు భక్తిశ్రద్ధలతో సంపాదించిన అనుభవమును ఆధారము చేసికొనియు వర్తమాన దేశకాలపాత్రముల ననుసరించియు, స్థానికసంస్థలును ప్రభుత్వమువారును ఈ యుద్యమాభివృద్ధికొఱకు ఇచ్చెడి ధనసహాయమును అనిష్టదాయకము కానపుడు చేయూతగా నంగీకరించియు, ఆంధ్రదేశమంతటను పాఠశాలలమూలమున జరుగుచున్న

విద్యాభివృద్ధియందు గల్గుచున్న లోపములను పరిసమాప్తిచేయుటకును, పాఠశాలలో ప్రవేశమునొందుటకు సావకాశములేనివారికిని వానిని వదలినవారికిని జ్ఞానాభివృద్ధిచేయుటకును, కావలసిన సాధనవిధానమును నిర్ణయించుట ఈరాబోవు గ్రంథాలయ మహాసభయొక్క ముఖ్యవిధి యైయున్నది. ఈవిధిని గమనించకగాని, సక్రమముగా నిర్వర్తించక గాని తరుణము పోగొట్టుకొనినచో, ఆంధ్రులు తమ ధర్మమును తప్పిన వారగుదురు. మన దేశమున అనేక కారణములవలన పార్టీలు పెచ్చుపెరిగినవి. జ్ఞానాభివృద్ధికై అన్నిపార్టీలవారును సమముగా అన్యోన్యసౌహార్దభావముతో, కృషిచేయవలసియున్నది. కావున తక్కిన యితర సభలు కొన్నిటిలోవలెగాక, ఈసభను జయప్రదముగా చేయుటకు అందరును జాతి, మత, రాజకీయకక్షి, విచక్షణ లేక దేశాభిమానులును భాషాభిమానులును తగుతోడ్పాటుసిచ్చి దేశకళ్యాణముకొఱకై బద్ధకంకణులగుదురని సవినయముగ విన్నవించు,

ఆంధ్రగ్రంథాలయసంఘము, } భవత్సేవకుడు
బెజవాడ. 20-9-29. } సూరి వెంకటనరసింహశాస్త్రి.

---

# పల్లెటూరు గ్రంథాలయములు-అమెరికా.

"మీరేమైన కోడిపిల్లలను కొనెదరా?" అని వృద్ధురాలగు నొక పల్లెటూరు స్త్రీ "క్లార్క్సడేలు" అను పట్టణగ్రంథాలయమునకు ఒక ఉదయమున వచ్చి ప్రశ్నించెను. ఆమె వితంతువు. పొలములలో పనిజేసియు, కోడిపిల్లలను అమ్ముకొనియు కుటుంబమును ఎట్లో పోషించుకొనుచుండెను. ఆమెబిడ్డలలో నొకరు ఒక గ్రంథమును కొనియియ్యమని అడిగెను. ఆగ్రంథాలయమొక పూటకూటి యిల్లని తలంచెను. కోడిపిల్లలను అమ్మగా వచ్చిన సొమ్ములోనుండి, కుటుంబమునకు గావలసిన వెచ్చములను కొని, ఇంకమిగిలిన ద్రవ్యమునుండి తనబిడ్డకొక గ్రంథమును తీసికొనవలెనని ఆమెతలంపు. ఆ గ్రంథాలయముయొక్క భాండాగారి మంచివాడు. కోరికగలవారికి అర్హమైన గ్రంథ

ములు అందుబాటులో నుండవలెనని ఆయన తలంపు. చివరకు జరిగిన ఫలిత మేమనగా, కోడిపిల్లలను అమ్మవలెనని వచ్చిన యా స్త్రీ, ఒక పుస్తకమునకు బదులుగా అరడజను గ్రంథములతో తనయింటికి జనెను.

ఇప్పుడాకుటుంబ మంతయు ఆ గ్రంథాలయమునుండి తఱచుగా పుస్తకములను తీసికొనిపోయి చదువుచుండెదరు. ఈ గ్రంథాలయము యొక్క భవనమును గట్టుటకై రు 30,000 లను కార్నీజీ కార్పరే షనువారు ఇచ్చినారు. ఆపట్టణ పారిశుద్ధ్యసంఘమువారు గ్రంథాలయ భవనమును నిర్మించుటకై స్థలమును ఉచితముగా నిచ్చుటయేగాక, సంవత్సరమునకు రు 3,000 ల నిచ్చుచున్నారు.

## నూతన పరిస్థితులు.

ఆదేశమందు చదువుకొనజాలని పురుషుడుగాని స్త్రీగానిలేదు. పొలములలో కూలిజేసి జీవించువారుగూడ తమబిడ్డలు తమ కంటె జీవయాత్రయందు మంచి సావకాశములను గలిగియుండవలె నని కోరుదురు. మునుపు మూలమూలలను ఒదిగియుండెడు పల్లెటూరు కుటుంబమువారు యిప్పుడు నూతన పరిచయములను కలుగజేసి కొనుచున్నారు. దూర దేశమునం దున్నవారితో మాట్లాడుటకు సదుపాయమును గలుగజేసిన "టెలిఫోను" పల్లెటూరులకు పట్టణ గ్రంథాలయములనుండి అప్పుడప్పుడు పంపబడు సంచార గ్రంథాలయ పేటికలు, ప్రపంచమునం దన్నిప్రదేశములందలి వార్తలను వన్నెకెక్కిన సంగీతమును, ప్రశస్తమైన ప్రసంగములను ప్రతినిత్యమును వినిపించుచున్న "రేడియో"— ఇవియన్నియు పల్లెటూరి జనుల యొక్క మనోనేత్రములను వికసింపజేసి, వారికోరికలను విజృంభింప జేయుచున్నవి. పల్లెటూరి రైతులను నిరసించిన ప్రపంచకము వారి నిప్పుడు గౌరవించుచున్నది. రైతుయొక్క వృత్తి కిప్పుడు నూతన గౌరవమును, నూతన శక్తియును గలిగినవి. కోట్లకొలది రైతులునూతన జ్ఞానమును సంపాదింప ఆతురులును, అపరూప విషయములను దెలిసి కొన కుతూహలులునై యున్నారు. అందుచేత పట్టణవాసులకు అత్యం

తావసరమైన సార్వజనిక గ్రంథాలయములవారు ఈ నూతనపరిస్థితులను గ్రహించి, రైతాంగమునకు ఉపకరించుటకు గావలసిన ఏర్పాటులను జేసికొనుచున్నారు.

## గ్రంథాలయ సేవా పరిమితి.

అమెరికా సంయుక్త రాష్ట్రములందు గల 3065 తాలూకాలలో 5954 సార్వజనిక గ్రంథాలయములు గలవు. ఆదేశమందలి జనులలో 4,50,69,897 మంది గ్రంథాలయముల ఉపయోగమును బొందుట లేదు. ఇందులో 4,21,52,291 మంది అనగా నూటికి 93 మంది పల్లెటూళ్ళయందు నివసించెడివారు. (2500 కంటె తక్కువ జనాభాగల గ్రామములలో నివసించెడివారు). పట్నములలోనుండు జనులలోనూటికి 6 గురుమాత్రము గ్రంథాలయముల ఉపయోగమును బొందుటలేదు. గతసంవత్సరమున సంయుక్తరాష్ట్రముల యందు రు 10,60,31,468 లు గ్రంథాలయములకై వినియోగింపబడినవి. అనగా ఒకమనిషికి ఒక రూపాయి ఖర్చుపెట్టబడినది. త్రాగుడునకు దీనికి పదకొండు రెట్లు ద్రవ్యము వినియోగ మగుచున్నది. సినీమాలకు దీనికి 22 రెట్లు ద్రవ్యము వినియోగ మగుచున్నది.

పల్లెటూళ్ళరైతాంగము బస్తీల వారికంటె ఎక్కువగా జ్ఞానదాయకము లగు గ్రంథములను జదివెదరు. పల్లెటూరు జనులకు గ్రంథాలయములు ఉపయోగ పడుటకు ఆదేశమందు అనేక పద్ధతులు అవలంబింప బడినవి.

40 జిల్లాలలో పల్లెటూళ్ళకు గ్రంథముల నంపు ఏర్పాటులు గలవు. ఒక్కొక్కసారి 50 పుస్తకములను పాఠశాలలకు, పల్లెటూళ్ళ ప్రతిష్ఠాపనలకు, తదితర సంస్థలకు పంపెదరు. పోస్టేజీని, స్వల్పమూల్యమును మాత్రము తీసికొందురు.

13 జిల్లాలలో 475 పట్టణ గ్రంథాలయములు గలవు. పల్లెటూరు శాఖాగ్రంథాలయములకు పుస్తకముల నంపుటకుగాను ఈ గ్రంథాలయములలో చాలభాగము మోటారుబండ్ల నుపయోగించును. 1844 సంవత్సరమందు స్థాపింపబడిన "ఒటిసిగో" గ్రంథాలయము

కడచిన 11 మాసముల కాలమందు 4,643 మంది పల్లెటూరు జనులకు గ్రంథముల నంపుటయేగాక, అనేక పల్లెటూరు పాఠశాలలవారికి పఠములను బొమ్మలను పరిశోధక గ్రంథములను పంపెను.

ఆ దేశమందు ప్రథమమున పల్లెటూరు గ్రంథాలయములు 1898 సంవత్సరమున స్థాపింపబడెను. అట్టి గ్రంథాలయములను స్థాపించుటకు చాల జిల్లాలు చట్టములను చేసెను. 245 తాలూకాలు తాలూకా గ్రంథాలయములను స్థాపించినవి. ఇవి తాలూకా కంతకును కేంద్ర గ్రంథాలయములుగ నుండి, శాఖా గ్రంథాలయములను గలిగియుండును. "కాలిఫోర్నియా" యందుగల 58 తాలూకాలలో 46 కేంద్ర గ్రంథాలయములు గలవు. "న్యూజెర్సి" యందుగల 21 తాలూకాలలో మూడవ వంతు యందు పన్నువేసి గ్రంథాలయములను స్థాపించుటకు ఏర్పాటులు జరిగినవి. ఈ కేంద్ర గ్రంథాలయములు ప్రజలయొక్క కోరిక వల్ల ఏర్పడును. వాని నిర్వహణమునకై స్వల్పముగా పన్నువేయబడును. ఈరీతిగా గ్రంథములేగాక, బొమ్మలు, పత్రికలు, సినీమాఫిలిములు, మాజిక్ లాంతరుపటములు ఇంకను అగత్యములగు ఇతర పరికరములును గూడ పల్లెలకు అందజేయబడుచుండును. ఆ దేశమునందు పల్లెటూరులకు జరుగు గ్రంథాలయ సేవ మిక్కిలి జయప్రదముగా నున్నది.

విలాసార్థము యేర్పడిన ఉద్యానవనములు గూడ విద్యాభివృద్ధికి ఉపయోగపడునటుల జేయు ప్రయత్నములు ఆ దేశమందు కడచిన 8 సంవత్సరములనుండియు జరుగుచున్నవి. ఉద్యానవనములకే తెంచువారు కూడ, చదువునందు ఎక్కువ అభిలాషను జూపుచుండిరి. అందుచేత ముఖ్యమగు వానియందు గ్రంథాలయముల నేర్పాటు చిరి. అట్టిగ్రంథాలయములు స్థాపింపబడిన పిమ్మట వాని ఉపయోగము అమితముగా పెరిగిపోయినది.

# గొప్ప గ్రంథాలయము - అమెరికా.

అమెరికా దేశ పట్టణములయందు, చిత్రకళా ప్రదర్శన మందిరములకును, గ్రంథాలయములకును గొప్ప భవనములను గట్టుటకై విశేషముగ ద్రవ్యమును వెచ్చించుచున్నారు. "ఫిడల్ఫేనియా" పట్టణమందు, రు 2,10,00,000 లతో చిత్రకళా ప్రదర్శన మందిర మొకటి నిర్మించుటకై "జోసెఫ్ విటెనర్" అను మహనీయుడు పూనుకొనెను.

ఇది యిట్లుండ, "యేల్" విశ్వవిద్యాలయ గ్రంధాలయమునకు రు 2,10,00,000 ల వ్యయముతో మహత్తరమైన భవన మొకటి నిర్మింపబడుచున్నది. దీనియొక్క ప్రధానభవనమువిూద గొప్పగొప్ప గోపురములను నిర్మించుచున్నారు. సింహద్వారమువిూద చిత్రవిచిత్రమైన పనితనము చూపబడినది.

ఈగొప్ప భవనముయొక్క పునాదులయందు 142 టన్నుల ఉక్కు (Reinforcing Steel) వేయబడినది; 51,000 బస్తాల సిమెంటును, 9000 ఘనగజముల కంకరయును, 4,500 ఘనగజముల ఇసుకయును 13,000 అడుగుల కర్రయును, 100 పెట్టెల మేకులును పట్టినవి. పైభాగ నిర్మాణమునందు 65,00,000 మామూలు ఇటుకలును, 1,70,000 చతురపు అడుగుల రాయియును, 50,000 బస్తాల సిమెంటును, 60,000 గజముల ఇసుకయును పట్టును. లోపలిపనిని పూర్తి జేయుటకు 28,000 ఘనఅడుగుల రాయి కావలెను. భవనమునందంతటను నేలమీాద సిమెంటుచేయుటకు 2,35,000 చతురపు అడుగుల ఇనుపఅల్లికచట్రములును, 4,400 ఘనఅడుగుల కంకరయును, 30,000 బస్తాల సిమెంటుయును, 2,00,000 చతురపు అడుగుల కర్ర చట్రమును కావలెను.

35,00,000 గ్రంథములు పట్టుటకు ఈ గ్రంథాలయమునందొక ఇనుపబీరువాల వరుస అంతస్థు నిర్మింపబడుచున్నది. ఈ వరుసను నిర్మించుటకు 2,000 టన్నుల ఉక్కుపట్టును, దారులయందును, మెట్లమీాదను వేయుటకు 1,000 టన్నుల మార్బిలురాయి పట్టును. ఇనుపబీరువాలు ఒకదానిప్రక్క మరియొకటి పెట్టినయెడల 15 మైళ్ళ

పొడవు అగును. బీరువాల యందున్న అరలు ఒకదాని ప్రక్క మరి యొకటి ఉంచినయెడల 80 మైళ్ళ పొడవుండును.

ఈ గ్రంథాలయమందు చదువరులకు సదుపాయముగా నుండు నూతనమార్పు లనేకము చేయబడియుండును. గాలియును, వెలుతురును, గ్రంథాలయ మం దంతటను బాగుగా వ్యాపించి యుండును. విద్యుచ్ఛక్తిచే నడుపబడు విసనకర్రల వలనను, గొట్టముల చేతను గాలిని గ్రంథాలయమం దంతటను ఎల్లప్పుడును ప్రసరింప జేయబడుచుండును. కావలసిన గ్రంథము ఉన్నదియును లేనిదియును తెలిసికొనుటకు ఒక నిమిషము మాత్రమే పట్టును. గ్రంథము ఉన్నయెడల, ఆగ్రంథము ఉన్న బీరువాదగ్గరకు చీటిని గొట్టముద్వారా పంపగా, అక్కడ నున్న గుమాస్తా ఆపుస్తకమునుదీసి, ఇంకొక సాధనము ద్వారా, పుస్తకములను ఎరువిచ్చుహాలు నందున్న గుమాస్తాకు పంపును.

అమూల్యములైన అనేక అపూర్వగ్రంథము లీగ్రంథాలయ మందు గలవు.

---

## కంభం-మార్కాపురం తాలూకాల

### గ్రంథాలయముల ప్రథమ మహాసభ.

13-8-29 తేదీన బేస్తవారపుపేటలో ఈసభ దిగ్విజయముగ జరిగినది. ప్రథమమున గ్రంథాలయ ధ్వజము స్థాపింపబడినది. ఈసభకు జిల్లావిద్యాశాఖాధికారియగు ఆలీ జనాబ్ గులాం దస్తగిరి సాహెబు గారు అధ్యక్షత వహించిరి. ఈక్రింది తీర్మానములు జరిగినవి.

1 రాజదంపతులకు ఆయురారోగ్య ఐశ్వర్యముల నొసంగుగాత యని సర్వేశ్వరుని యీసభవారు ప్రార్థించుచున్నారు.

2 తెనుగుదేశమునం దుండు గ్రంథాలయములను ఈసభవారు అభినందించుచున్నారు.

3 రాయలసీమయందుండు గ్రంథాలయములను పోషింపవలయు

నని దొరతనమువారిని, జిల్లా తాలూకాబోర్డులను ఈసభవారు ప్రార్థించుచున్నారు.

4 "ఐంద్రావతిని" ద్వైవారపత్రికగా మార్చవలయునని పత్రికాధిపతిని దానిని సరిగా పోషింపవలయునని రాయలసీమవారిని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

5 శ్రీవరదరాజమ్మ గ్రంథాలయమునకు ఈసంవత్సరము ద్రవ్యసహాయము నిప్పించవలయునని అధికారవర్గమువారిని యీసభవారు ప్రార్థింపుచున్నారు:

6 శేషాద్రిరమణకవులచే రచియింపబడిన గ్రంథములను అందులో ముఖ్యముగా మహాత్మాగాంధిగారిచే మెప్పువడసిన, "దానబోధ" అను గ్రంథమును, వేలమూరి జానకిరామశాస్త్రిగారిచే ప్రకటింపబడుచున్న రామాయణ గ్రంథమును, గ్రంథాలయమువారును, విద్యాశాఖ వారును అన్నివిధముల ప్రోత్సహింపవలయునని యీసభవారు కోరుచున్నారు.

7 శ్రీ వరదరాజమ్మ గ్రంథనిలయమునకును, వారిచే జరుపబడుచున్న రాత్రిపాఠశాలకును ఉచితముగా తమ పత్రికలను పంపవలయునని తెనుగుదేశమునందుండు వార్తా పత్రికల అధిపతులను ఈసభవారు ప్రార్థించుచున్నారు.

8 ఈజిల్లాలో గ్రంథాలయములు లేనిచోట్ల గ్రంథాలయములను స్థాపించునట్లు డిప్యూటి ఇన్‌స్పెక్టర్లను ఉపాధ్యాయులను ప్రోత్సహించ వలయునని శ్రీ జిల్లా విద్యాశాఖాధికారిని యీ సభవారు ప్రార్థించుచున్నారు.

9 విద్యాభివృద్ధి కావలసియున్న యీగ్రామంలో తాలూకాబోర్డువారి పాఠశాలను వీలైనంత తొందరలో నెలకొల్పుదురని యీ సభవారు బోర్డువారిని ప్రార్థించుచున్నారు.

10 ద్వితీయ గ్రంథాలయ మహాసభ మార్కాపురంతాలూకాలో జరుపవలయునని తీర్మానించడమైనది.

11 వ్యయప్రయాసల కోర్చి సభను జయప్రదముగా జరిపిన శ్రీయుత నేపూరి యల్లమందయ్య సెట్టిగారిని యీసభవారు అభినందించుచున్నారు.

ఈసభతో బాటు శ్రీ వరద రాజమ్మ గ్రంథాలయ ద్వితీయ వార్షికోత్సవముకూడ జరిగినది

---

## శ్రీమోహన విలాస గ్రంథాలయము.

చెన్నపురియందున్న శ్రీమోహన విలాస గ్రంథాలయ వార్షికోత్సవము 1-9-29 సాయంత్రము శ్రీ ఉప్పటూరి ఆల్వారుచెట్టిగారి సత్రమునందు ఏతద్గ్రంథాలయ సభ్యులచే జయప్రదముగ నలువబడెను. నాటి సభకు ది. బ. యల్. ఏ గోవిందరాఘవ అయ్యరుగారు అధ్యక్షత వహించిరి.

శ్రీసాహిత్య సరస్వతీత్యాది బిరుదాంకితులగు శతావధాని దోమా వెంకటస్వామి గుప్తగారు పైసభయందు శ్రీ మోహనవిలాస గ్రంథనిలయాభినందన పద్యపంచరత్నములను చదివి, ఉషాపరిణయ కథను ఆశువుగాచెప్పి సదస్యుల మెప్పించిరి. ఇంకను దత్తాక్షరి, సమస్యాపూరణము మొదలయిన వానిని గావించి, సభ్యుల హర్షమున కెంతయు పాత్రులయిరి. శ్రీ కాళీవర ప్రసాదరావుగా రను యువకులు శ్రీ గుప్తగారిపై కొన్ని ప్రశంసాపూర్వకమగు పద్యముల జదివిరి. సమావేశమునకు పెక్కండ్రు పురప్రముఖు లరుదెంచి చందనాగరుఫలపుష్ప తాంబూలాదికములచే సత్కరింపబడిరి.

### ఉపన్యాసము

పచ్చయ్యప్పకళాశాలలో ఉపాధ్యాయు లగు పి. సుబ్రహ్మణ్య అయ్యరుగారు "సామాన్య విజ్ఞానసాధనములు" అనువిషయమును గూర్చి ఉపన్యసించుచు నీ దేశమున ప్రజాస్వామ్యప్రభుత్వము సంస్థాపితమై అందుకు శాశ్వతపునాదు లేర్పడవలయు ననిన సాధారణ విజ్ఞా

నాభివృద్ధి ఎంతయు నావశ్యకమనియు, మోహన విలాస గ్రంథనిలయ మట్టి విజ్ఞాన ప్రచార సాధనములలో నొకటి యని నమ్ముచున్నాననియు పలికిరి.

ప్రజాస్వామ్యభావ ప్రభావమునకు పుస్తక భాండాగారాది సాధనములు ఆవశ్యకములే యని అంగీకరించినచో ప్రభుత్వసహాయముపై నాధారపడని ప్రజాపోషిత స్వతంత్ర సంస్థలతో చేరెడి మోహనవిలాస గ్రంథాలయాద్యనేక సంస్థాపనలపట్ల వైముఖ్యము వహింపజాల మనుట నిక్కవము. ఇట్టి దేశోపకార కార్యములే యిట్టి విద్యాదానోత్సుకతయే నిజమగు ప్రజోద్యమమునకు సాధనభూతమై దేశాభివృద్ధి కారక మగుచున్నది. పాశ్చాత్య దేశములందలి కేంబ్రిడ్జి, ఆక్సుఫర్డు విశ్వకళాపరిషత్తులనుబోలిన విద్యాప్రతిష్ఠాపనలు మన దేశమున నెలకొల్పబడి విద్యాప్రబోధము జరుగవలయునని నా యాశయము. మన భారతీయ పరిషత్తులు ఎదుగు బొదుగులేని ప్రస్తుత స్థితినుండి మార్పుజెంది విద్యా సముపార్జనకును జ్ఞానాభివృద్ధికిని, జ్ఞాన ప్రబోధమునకును నిజమగు కేంద్రములు కావలయును. మన కళాపరిషత్తులు ఇక్కార్యము ఎంతవరకు సాధించినవో అనువిషయము విచారణీయము. పాశ్చాత్యకళా పరిషత్తు సంస్థలకు నైజమగు పరిషత్ ప్రచారకోద్యమ కృషి మన విద్యాసంస్థలకును ప్రధానాంగముగ నుండవలయును. సనాతన భారతవర్ష విశ్వకళాపరిష ద్విధానమును పరిశీలించితిమేని నాటి మహోన్నతదశయు తక్షశిల, నలంద, కాంచీపుర విద్యాప్రతిష్ఠాపనల ఉత్తమత్వమును గోచరింపగలదు. ఆమహాసంస్థలు విజ్ఞాననిలయములై సమస్తప్రపంచమునకును ఆదర్శ ప్రాయములై నెగడియుండెను. దేశమునందలి ఉత్తమోత్తమజ్ఞానము ఆసంస్థలయందు ప్రతిబింబిత మగుచుండెను. భావౌన్నత్యము నిరాడంబర జీవితములే సనాతన భారతీయ పండితుల ప్రధానాశయములు. పాశ్చాత్యవిజ్ఞాన నాగరకతా ప్రభావమునంజేసి ప్రాచీన భారతీయ కళావిజ్ఞానము లెంతయు సంకుచితములై నామమాత్రములై యున్నవి. జ్ఞానప్రచారమే ఆధునిక విశ్వకళా

పరిషత్తుల యేకైకాశయముగ నుండవలయును. ఏమన, జ్ఞానమే శక్తి. నిజమగు విద్యావిధానము మారుమూలలందుండు సామాన్యమానవుని సహితము దేశవ్యవహారములందు పాల్గొనుటకు అర్హతమునిగ చేయవలెను. జ్ఞానమును భావనాశక్తిని వికసింపజేయవలెను. మరియు శీలమును పెంపొందింపవలెను. బాహ్యచక్షువులచే ప్రపంచమును తిలకింపజాలినంతమాత్రమున జ్ఞానమనిపించుకొనజాలదు. అంతరింద్రియజ్ఞానముచే వస్తుతత్త్వమును పరిశీలించి సదసద్విచారము గావించెడి సమర్థతయే నిజమగు జ్ఞానమార్గము. జ్ఞానము ఆధ్యాత్మిక మతసంబంధము కలిగియుండవలెను. సనాతనభారతవర్షమునందలి దేవాలయములు ఇట్టి ఆధ్యాత్మికజ్ఞానమునకు నిలయములైయుండెడివి. అట్టి జ్ఞానోపదేశకములును విజ్ఞాననిలయములును నగు దేవాలయములను పునరుద్ధరించితిమేని, మరల దేశమును విజ్ఞానపూరితముగ నొనర్పవచ్చును. పూర్వమీ దేవాలయములందు కళావిజ్ఞానములు పరస్పరాశ్రితములై అవినాభావసంభావన కీప్రజలకు ఉదాత్తభావస్ఫూర్తి జనింపజేయుచుండెడిది. సత్యసౌందర్యసంయోగము ఈశ్వర సాక్షాత్కారము లీ దేవతాసంస్థల వలన కలుగుచుండెను. పూర్వమీ దేశమున వెలసియుండిన మతసంస్థలు ప్రజాప్రతినిధి సంస్థాపనలు కళాపరిషత్తులును మానవుని నిత్యనైమిత్తిక జీవితమును సక్రమమార్గముల నడిపించుటకు తోడ్పడుచుండెడివి. గ్రంథాలయమునకు సద్గ్రంథములే ప్రధానములు. గ్రంథములు యెన్నియేని కోట్లకొలంది కలవుగాని కవియొక్క అమూల్యమగు జీవితరుధిర సంయుతమగు గ్రంథమే శాశ్వతమును సర్వోత్తమమునగు గ్రంథము. మిల్టనుమహాకవి చెప్పినటుల విశ్వమందు దేనినైనను సంహరింపనగునేగాని ఉత్తమమగు గ్రంథరాజమును సమయింపజాలము. ఉత్తమ గ్రంథమును సంహరించుటయనిన అమృతత్త్వమును నశింపజేయ బూనుటయే. మానవుని జీవితానుభవములు సద్గ్రంథములందు మరుగుపడి యుండజాలవు. భావోత్కృష్టతను, ప్రబుద్ధమానసమును నిష్కలుషిత నైజము ప్రవర్ధిల్లజేయునట్టివే సద్గ్రంథములని యొప్పుకొనక తప్పదు. భారతదేశమును నివాసయోగ్యముగను మహోన్నతమును గావింపవలయుననిన సర్వమానవసౌజన్యమును జీవిత సమరసమును

అభివృద్ధిజేయ గడంగవలయును. వార్తాపత్రికలను వాని యుపయోగమును తెలిసి యెంతవరకు అందలి విషయమును గ్రహింపనగునో అంత మట్టునకే మనకు జ్ఞానసాధనములుగ గావించుకొనవలయునేగాని పాక్షికములగు పత్రికాభిప్రాయములకు వశ్యులము కారాదు.—అనిపల్కిరి.

అధ్యక్షులు.

యల్. ఏ. గోవిందరాఘవయ్యరుగారు సభను ముగించుచు భారతవర్షము అనాదినుండియు నొక జాతిగ జీవించియుండుటకు ఆ దేశమందలి విజ్ఞానమును ఆ విజ్ఞానాంతర్భూతమగు ఆధ్యాత్మికతత్త్వమునే ముఖ్యకారణములని నుడివిరి. భారతీయులు ఆబాలగోపాలమును తమ నిత్యజీవితమందను క్షణమును ఆధ్యాత్మిక భావప్రేరితులయి యుండుటయే తక్కుంగల సమస్తజాతుల వారికంటె వీరు ఉత్తమపదవి యందుండుటకు హేతువైయున్నది. పరోపకార పారీణతయు, స్వార్థవిరహితత్వమును, నిష్కామ్యకర్మపరత్వమును, భారతదేశమందలి సామాన్యగృహస్థుని ఉత్తమాదర్శములయి యొప్పుచుండును. వీనిపైననే భారతీయవిజ్ఞాన మాధారపడియున్నది. ప్రస్తుతము మన దేశమునందును స్థితిగతులు మారినవి. విశ్వవాహినియందు కాలానుగుణ్యముగ జీవితమును యీదుకొనవలయునేగాని, యేటి కెదురీత నీదజూచుట సాహసకార్య మగును. కావున నాగరకప్రపంచముతోపాటు మనము తగు సంస్కారము నలవరచుకొని అభివృద్ధిజెందవలసి యున్నది. మనయందు అంతర్గర్భితమై యుండెడి సమృద్ధసమున్నతాధ్యాత్మిక శక్తిని వివిధశాఖలందును విజృంభింప జేయవలయును. సంకుచితభావశృంఖలముల బారినుండి తప్పుకొనవలెను. విశ్వమానవాదర్శము నలవరచుకొనవలెను. మనవిధి బాధ్యతలను గుర్తింపవలెను. ప్రజాప్రబోధమునకు గడంగి దేశహితోద్యమములకు తోడ్పడవలెను. అట్లొనర్చినచో మన దేశము నిక్కవముగా సర్వతోముఖవికాసము నొందగల్గును—అని పల్కిరి. పిమ్మట గ్రంథాలయము తరఫున ఏ. రంగనాథంశెట్టిగారు అధ్యక్షులకును, ఉపన్యాసకులకును, శతావధాని వెంకటస్వామిగుప్తగారికిని వందనము లర్పించిరి. అంతటితో సభ ముగిసెను.

---

# గ్రంథాలయములు - రైతాంగము

రహితాంగమువారు చదువుకొన్న కొద్దిపాటి విద్యకు యేలాటి అభివృద్ధియు లేనందున రహితుల పిల్లకాయలు చదువుమానిన కొద్ది దినములకే తిరుగా నిశానిదారు లగుచున్నారు. "అభ్యాస సారణే విద్యా" అను ప్రకారము పరిశ్రము చేయుకొలది విద్య అభివృద్ధి చెందును. పరిశ్రమ లేనియెడల యేవిద్యయును అభివృద్ధి కాజాలక పోవుటయే గాక నశింపు కాబడుచున్నది. రహితాంగమునకు పరీక్షలతో నిమిత్తము లేదని నాఅభిప్రాయము.

ఒక గ్రామములో ప్రతి రహితున్ను తనకు గావలసిన అన్ని గ్రంథములును ప్రతివారు సంపాదించుకొనుట సాధ్యముకాని పని.

ప్రస్తుత కాలమున గ్రంథాలయములు దేవాలయములతో సమానములనియు, కొన్ని విషయములలో దేవాలయములకన్న గ్రంథాలయములే శ్రేష్ఠతమము లనియు నా అభిప్రాయము.

శ్రీ భాగవతం సప్తమస్కంధములో ప్రహ్లాదుడుచెప్పినరీతిగా "తను హృద్భావముల సఖ్యముల్, శ్రవణముల్, దాసత్వముల్, వందనార్చనముల్, సేవయు, ఆత్మలో నెరుకయుల్, సంకీర్తనల్, చింతనం, బను నీతొమ్మిది భక్తిమార్గముల సర్వాత్ముల్ హరిల్ నమ్మి సజ్జనుడై యుండుట భద్రమంచు దలతుల్ సత్యంబు దైత్యోత్తమా"

అను పద్యముయొక్క తొమ్మిది మార్గములలో దేవాలయములకన్న యెక్కువభాగము గ్రంథాలయములవల్లనె సులభసాధ్యమని నాఅభిప్రాయము.

ప్రతి రహితున్ను వ్యవసాయశాస్త్రము, జంతుశాస్త్రము, వృక్షశాస్త్రము, రసాయనశాస్త్రము, అర్థశాస్త్రము, ఆరోగ్యశాస్త్రము మొదలగు గ్రంథములును, మతగ్రంథములను చదువుట చాలా ముఖ్యమయియున్నది.

ఇంతట నైనను ప్రతిగ్రామము యొక్క రహితాంగమును వార్తాపత్రికల యొక్కయు, గ్రంథాలయముల యొక్కయు, ఆవశ్యకములను గుర్తెఱిగి ప్రతిగ్రామములోను వారివారిశక్తికొలది గ్రంథాలయములు నెలకొల్పుటయును వాటియొక్క ఫలములను పొందుటయును అత్యంతావశ్యకములని నా అభిప్రాయము.

—అన్నంరాజు శ్రీరాములు.

---

## శ్రీ శివజ్ఞానబోధ సమాజము

పైగ్రంథాలయమును తెనాలితాలూకా చిలుమూరు గ్రామములో షుమారు 10 సంవత్సరములక్రితము స్థాపింపబడెను. వేదాగమ పురాణేతిహాసగ్రంథములు, స్మృతులు, ధర్మశాస్త్రములు, మతగ్రంథములు వేదాంతగ్రంథములు నవలలు నాటకములు చరిత్రలు మున్నగు షుమారు 300 గ్రంథములతో ప్రకాశించుచున్నది. ఈ గ్రంథాలయమున కనుబంధముగా "శ్రీ గురుకులాశ్రమము" అను పేరున నొక విద్యాలయము స్థాపింపబడెను. ఇచ్చట సమస్తవిద్యలు బోధింపబడుచున్నవి. "ఆశ్రమము" పక్షమున "శ్రీ ఆదిశైవపత్రిక" యనెడు నొకమాసపత్రిక అయిదు సంవత్సరములనుండి ప్రకటనయగుచున్నది. అందువలన నీగ్రంథాలయమునకు షుమారు 50 పత్రికలు విరామము లేకుండా వచ్చుచుండును ఎవ్వరికి ఏవిధమైన చందాలు విధింపబడక పోవుటచే ధర్మగ్రంథాలయముగా పరిణమించినది. కావున భాషాభిమానులగు ధర్మమూర్తులు గ్రంథరూపకమైన సహాయమొనరించి యీ గ్రంథాలయమును వృద్ధిలోనికి దేగలందులకు మనవిచేయుచున్నాను.

—చిలుమూరు పురుషోత్తమ గురుక్కళ్.

---

RSVM01A143

16



## శ్రీ విజ్ఞానవర్ధనీ గ్రంథనిలయము, భట్లపెనుమర్రు

ఈ గ్రంథాలయము 1914 సంవత్సరము స్థాపింపబడి చాల అభివృద్ధి గాంచినది. కాని సరియైన నిర్వాహకులు లేక క్రమముగా క్షీణదశకు వచ్చినది. తిరిగి ఇప్పుడు గ్రామస్థులయందు ఉత్సాహము జనించి, 1360 రూపాయిలు చందాలు వేయబడినవి. ఇప్పడీ గ్రంథాలయమందు 900 గ్రంథములు గలవు. గ్రామమందుగల సత్రము డాబామీద మేడకట్టి అందుంచిన మిక్కిలి అనుకూలముగ నుండును. ఈ గ్రంథాలయమునకు చలసాని వీరయ్యగారు అధ్యక్షులుగాను గొట్టిపాటి సూర్యనారాయణగారు కార్యదర్శిగాను ఉన్నారు.

---

## శ్రీ ఆంధ్రసంవర్ధనీ గ్రంథాలయము, శికింద్రాబాదు

ఈ గ్రంథాలయము యొక్క చతుర్వింశ ద్వార్షికోత్సవము శ్రీ శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి యాధిపత్యమున ఆగష్టు 17, 18 తేదులయందు జయప్రదముగా జరిగినది. పలువురు ఉపన్యాసములనిచ్చిరి. విద్యార్థులు ఆశువుగా ఆంధ్రమందు ఉపన్యసించుటయందు పోటీ పరీక్ష జరుపబడినది. ఆశువు పోటీయందు జయమొందిన విద్యార్థికి రు 10 లు విలువగల గ్రంథములు బహుమతిగానియ్య బడినవి. శికింద్రాబాదు ఉన్నత పాఠశాలలో స్కూలుఫైనలు పరీక్షయందు తెలుగులో ఎక్కువమార్కులు గడించిన విద్యార్థికి బంగారు పతక మియ్యబడినది.

---

| | |
|---|---|
| | **మనసు ఫౌండేషన్**<br>**పుస్తకాల పరిశీలనాపట్టిక** |

| | |
|---|---|
| **పుస్తకం సంఖ్య** | RSVM01A143 |
| **పుస్తకం పేరు** | [illegible] |
| **తారీఖు** | 7/6/24 |
| **ముందు అట్ట** | yes |
| **వెనుక అట్ట** | yes |
| **మొత్తం పేజీలు** | 19 |
| **పెద్ద సైజు పేజీలు** | No |
| **ఖాళీ పేజీలు** | No |
| **లేని పేజీలు** | No |
| **తయారు చేసినది** | Sandhya |
| **పేజీలు విడదీసినది** | Sandhya |
| **స్కాన్ చేసినది** | Sandhya |
| **పరీక్ష చేసినది** | pragathi |
| **పేజీలు సరిచూసినది** | |
| **బైండింగు చేసినది** | |
| **ప్యాకింగు చేసినది** | |
| **స్కాన్ చెయ్యనివి** | |
| **తప్పులు** | No |
| పరిస్థితి | good |